క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ



శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ

కొమ్మాది: రుషికొండ శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీవారిని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ దర్శించుకున్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వంశీకృష్ణ అన్నారు. అంతరాలయంలో పూజలు అనంతరం టీటీడీ అర్చకులు వేద ఆశీర్వాదం, ప్రసాదం అందజేశారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ లొడగల అప్పారావు, తదితరులు ఉన్నారు.

లక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేక అభిషేకాలు



లక్ష్మీనారాయణ స్వామికి పంచామృతాభిషేకాలు చేస్తున్న అర్చకుడు

మధురవాడ: మాఘ పౌర్ణమి సందర్భంగా మధురవాడలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. మధురవాడలోని అష్టలక్ష్మి సహిత లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసశర్మ, సిద్ధేశ్వరస్వామి ఆలయంలో దూసి రామలింగ స్వామి ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు.

నిత్యావసర సరకుల అందజేత



తమ్మయ్య కుటుంబానికి సాయం అందిస్తున్న నాయకులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ కొసనవానిపాలెం గ్రామానికి చెందిన కొసన తమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో చనిపోవడంతో స్థానిక నాయకులు ఆదివారం ఆయన కుటుంబానికి నిత్యావసర సరకులతో పాటు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సరగడ అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు చుక్క ఈశ్వరమ్మ, శివాజీ, కొసన అప్పలరెడ్డి, సరగడ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్‌కు నగదు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం ఆదివారం నగరంలోని పిఠాపురం కాలనీకి చెందిన ఇమంది లక్ష్మీప్రసాద్ రూ. లక్ష విరాళం ఇచ్చారు. సంబంధిత విరాళాన్ని ఆలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు నగదురూపంలో అందజేశారు. దాతకు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

2 సబ్‌స్టేషన్లు.. రూ.80 లక్షల అభివృద్ధి పనులు



తాళ్లవలసలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ బాక్సులు

- చిట్టివలస, తాళ్లవలస సబ్‌స్టేషన్ల పరిధిలో చురుగ్గా పనులు
- ఇప్పటికే రూ.60 లక్షల విలువైన పనులు పూర్తి



తగరపువలసలో స్తంభం మారుస్తున్న కార్మికులు



సంగివలసలో 8 మీటర్ల స్తంభాల స్థానంలో 11 మీటర్ల స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

తగరపువలస: చిట్టివలస, భీమిలి మండలం తాళ్లవలస విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో రూ.80 లక్షల అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటి వరకు రూ.60 లక్షల విలువైన పనులు పూర్తికాగా మిగిలిన రూ.20 లక్షల పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ సబ్‌స్టేషన్ల పరిధిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు ఆధునికీకరణ, ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ బాక్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు వీధుల్లో వేలాడుతున్న, ఇళ్లపై వాలిన స్తంభాలను సరిచేస్తున్నారు. ఇంకా సబ్‌స్టేషన్లలో విద్యుత్ ఉపకరణాలకు పెయింటింగ్ పనులు కూడా చేపట్టనున్నారు. ప్రస్తుతం పూర్తయిన అభివృద్ధి పనులు 2022 నవంబరు నుంచి 2023 ఫిబ్రవరి వరకు ఈ విధంగా ఉన్నాయి.

- 11 కేవీ తగరపువలస పరిధిలో తక్కువ సామర్థ్యం కలిగిన పాత 34 చదరపు మిల్లీమీటర్ల కండక్టర్ స్థానంలో 55 చదరపు మిల్లీమీటర్ల కండక్టరును మార్చారు. వీటిలో జాతీయ రహదారి వెంట ఉన్న ఎల్‌టీ, హెచ్‌టీ స్తంభాల కండక్టర్లు కూడా ఉన్నాయి. వీటికి రూ.6.50 లక్షలు ఖర్చు చేశారు.
- సంగివలస అనిట్స్ కళాశాల రహదారిలో తక్కువ ఎత్తు అనగా 8 మీటర్ల పొడవైన స్తంభాల స్థానంలో ప్రత్యామ్నాయంగా 11 మీటర్ల పొడవైన స్తంభాలు 13 వేశారు. కండక్టర్లతో సహా వీటికి రూ.6 లక్షలు ఖర్చు చేశారు.
- భీమిలి జోన్ ఒకటో వార్డు బాలాజీనగర్ పరిసరాలలో పాత స్తంభాలు, కండక్టర్ల స్థానంలో కొత్తగా 10 స్తంభాలు, కండక్టర్లు మార్చారు. దీనికి రూ.4 లక్షలు ఖర్చు చేశారు.
- తాళ్లవలస 11 కేవీ, 33 కేవీ లైన్‌లో తరచూ జరుగుతున్న విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని అధిగమించడానికి ఎం+12 టవర్లు, కండక్టర్లు మార్చడానికి రూ.3.30 లక్షలు ఖర్చు చేశారు.
- చిట్టివలస, తాళ్లవలస సబ్‌స్టేషన్ల పరిధిలో ప్రమాదాల నివారణకు 28 డిస్ట్రిబ్యూషన్ బాక్సులు ఏర్పాటు చేశారు.
- తగరపువలస, చిట్టివలసలో ప్రధాన మార్గాలలో ఆరు చోట్ల దిగువ ఉన్న ప్లింత్‌లను ఎత్తయిన ప్లింత్‌లుగా మార్చడానికి రూ.4 లక్షలు వెచ్చించారు.
- తాళ్లవలస, చిట్టివలస సబ్‌స్టేషన్ల పరిధిలో 22 చోట్ల ఏబీ స్విచ్‌లు కొత్తగా ఏర్పాటు చేయనున్నారు.
- నమ్మివానిపేటలో లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి రూ.4 లక్షలతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నారు.

తక్షణం విద్యుత్ సమస్యల పరిష్కారం



వినియోగదారులకు ఎలాంటి సమస్య ఉన్నా తక్షణం సబ్‌స్టేషన్లలో ఉన్న సిబ్బంది దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తాం. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నాం. ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ పోలాకి శ్రీనివాసరావు తరచూ వినియోగదారుల సమస్యలపై దృష్టి సారించి మెరుగైన సేవలు అందించడానికి ప్రోత్సహిస్తున్నారు.

– బొట్ట రవి, ఏఈఈ, చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

కొమ్మాది: భీమిలిలోని శ్రీపొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో 2002–03 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు భీమిలి బీచ్ రోడ్డులో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు.

త్వరలో స్కూల్ పేరిట ఒక ట్రస్టును ప్రారంభించి తమ స్నేహితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారిని గుర్తించి సహకారం అందించే విధంగా ప్రణాళిక రూపొందించుకున్నారు. కరోనా, ఇతర కారణాల వల్ల చనిపోయిన పలువురు స్నేహితుల కుటుంబాలను త్వరలో కలసి చేయూతనిచ్చేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేష్, జనార్దన్, సీతారామ్, నారాయణ, బడే అమ్మోరు, గద్దిపిల్లి రమేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

భీమిలి బీచ్‌లో మాఘ పౌర్ణమి స్నానాలు



బీచ్‌లో పుణ్యస్నానాలు చేస్తున్న జనం

భీమునిపట్నం: మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం భీమిలి బీచ్‌లో భారీగా జనం పుణ్యస్నానాలు ఆచరించారు. ఉదయం ఆరు గంటలే సాగర తీరం భక్తులతో నిండిపోయింది. ఇక్కడ పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనం బీచ్‌కు వచ్చి స్నానాలు చేయడంతోపాటు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు జరిపారు. అలల ఉధృతి బాగా తక్కువగా ఉండటంతో అందరు ఎటువంటి ఇబ్బందులు పడకుండా స్నానాలు చేశారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక



23 ఏళ్ల తర్వాత కలుసుకున్న భీమిలి డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1999లో బీకాం డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఇక్కడ కలుసుకున్నారు.

వీరందరు అనేక ప్రాంతాల్లో పలు ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. ఇప్పుడు 23 ఏళ్ల తరువాత మళ్లీ ఒక చోట కలుసుకోవడంతో భావోద్వేగానికి లోనైయ్యారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుని కుటుంబ విషయాలు, ఎవరు ఎక్కడ ఉంటున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాత విషయాలను గుర్తుకు చేసుకుని సాయంత్రం వరకు ఆనందంగా.. సరదాగా గడిపి సందడి చేశారు.

మహిళలకు రక్షణ కవచం ‘దిశ’



దిశ స్టాల్‌ను సందర్శనలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

కొమ్మాది: రాష్ట్రంలో 18 దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసి అందులో ఒక డీఎస్పీ స్థాయి ఆఫీసర్‌ను నియమించి మహిళలకు రక్షణ కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పేర్కొన్నారు. రుషికొండ రాడిసన్ బ్లూలో జరుగుతున్న షీ ఈజ్ ఏ చేంజ్ మేకర్ అనే మహిళా ప్రజా ప్రతినిధుల సదస్సులో ఏర్పాటు చేసిన దిశ స్టాల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కల్యాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన దిశ చట్టం, దిశ యాప్ మహిళలకు ఒక రక్షణ కవచంలా ఉందన్నారు. మహిళల ఫోన్‌లో దిశ యాప్ ఉంటే వారికి ఒక అన్న తోడుగా ఉన్నట్లే సీఎం భరోసా కల్పించారని చెప్పారు. ఈ సదస్సుకు హాజరైన పది రాష్ట్రాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులు దిశ యాప్ ప్రాముఖ్యత తెలుసుకున్నారు. ఈ యాప్ ఆడపిల్లలకు ఒక వరమని మహిళా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

బాలుకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సామవేదం బాలసుబ్రహ్మణ్యం

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామానికి చెందిన సామవేదం బాలసుబ్రహ్మణ్యం(బాలు)కు ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని సరస్వతి భవన్‌లో ఈ అవార్డును బాలసుబ్రహ్మణ్యంకు యూనవర్సిటీ కో–ఆర్డినేటర్ లయన్ అకుల రమేష్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ చైర్మన్ రామకృష్ణ గౌడ్ అందజేశారు. కళలు, సామాజిక రంగాలకు బాలు చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డును ఇచ్చారు. 40 ఏళ్ల నుంచి పౌరాణిక రంగ స్థల నటుడిగా పలు పాత్రలు ఆయన పోషించారు. పురోహితుడిగా 50 ఏళ్ల నుంచి సేవలందిస్తున్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు జెర్సీల బహూకరణ



క్రీడాకారులకు జెర్సీలు బహూకరిస్తున్న సీనియర్ క్రీడాకారుడు రామ్‌జీ

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో ఆదివారం సాయంత్రం సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మంతిన రామ్‌జీ జూనియర్ క్రీడాకారులకు రూ.10 వేల విలువైన జెర్సీలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీపోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్ తరపున క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జామి అప్పలకృష్ణ, శొంఠ్యాన జడ్సన్ రాబర్ట్‌సన్, పందిరి శ్రీనివాసరావు, చేట్ల వెంకట్, అనకాపల్లి శివ, తమ్మిన శివ శంకర్, కొయ్య రాంబాబు, బోర చినరెడ్డి, శివ, మోసెస్, మురళి, శ్రీపోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్ కార్యదర్శి అక్కరమాని చినబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసులో ఆధార్ సేవలు

మధురవాడ: కొమ్మాది కూడలి సమీప బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసులో ఆధార్ సేవలు అందిస్తున్నట్టు ఏఈ బండారు నాగరాజు తెలిపారు. ఇక్కడ ఉన్న కస్టమర్ సర్వీసు సెంటర్‌లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్, బయోమెట్రిక్, డెమో గ్రాఫిక్ అప్‌డేట్స్, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ లింక్ వంటి సేవలు అభ్యమవుతాయని చెప్పారు. ఆఫీసు పనివేళల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నష్ట పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి



నిరసన తెలుపుతున్న రైతుల కుటుంబ సభ్యులు

పద్మనాభం: మండలంలోని గంధవరంలో జగనన్న పట్టణ గృహ అభివృద్ధి పథకానికి తమ నుంచి తీసుకున్న భూములకు నష్ట పరిహారం ఇవ్వలేదంటూ ఆదివారం భూముల వద్ద రైతుల కుటుంబ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. విజయగనగరం జిల్లా జామి మండలం నారాయణపురానికి చెందిన రాజాన సోములు తన వద్ద నుంచి ఐదెకరాల డి–ఫారం, లఘుడు దేముడు తన వద్ద నుంచి పదెకరాల డి–ఫారం భూమిని రెవెన్యూ అధికారులు తీసుకున్నారని తెలిపారు. మామిడి తోటలతో ఉన్న భూములను 2019లో అధికారులు తీసుకుని ఇంత వరకు నష్ట పరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన రాపర్తి శత జయంత్యుత్సవాలు



యోగా కేంద్రం అధ్యక్షుడు వెంకటేశ్వరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

భీమునిపట్నం: భీమిలి యోగా శిక్షణ సంస్థలో రెండు రోజుల పాటు జరిగిన యోగాచార్య రాపర్తి రామారావు శత జయంత్యుత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేక ఆహ్వానితుడు రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి ఎన్.నర్సింహప్ప మాట్లాడుతూ రాపర్తి రామారావు యోగాచార్యగా అందించిన సేవలు గొప్పవని కొనియాడారు. శిక్షణతో పాటు ప్రతి ఒక్కరూ విలువలతో ఎలా జీవించాలన్న దానిపై కూడా అందరికీ బోధించే వారన్నారు. ఈ కారణం వల్లే ఆయనకు అన్ని ప్రాంతాల్లోనూ పెద్ద సంఖ్యలో శిష్యులు ఉన్నారని, వారంతా గురువు బోధించిన మార్గంలో నడుస్తూ గుర్తింపు పొందుతున్నారని పేర్కొన్నారు. ఇటువంటి గొప్ప వ్యక్తులను నిరంతరం స్మరించుకోవడం అందరి ధర్మమన్నారు. యోగా కేంద్ర ఉపాధ్యక్షుడు సిహెచ్. వెంకటరమణ మాట్లాడుతూ తనతోపాటు ఎంతో మంది రాపర్తి శిష్యులమన్నారు. ఆయన బోధించిన విధానాలనే అందరికీ శిక్షణ రూపంలో అందిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరినీ గౌరవిస్తూ నిరాడంబర జీవనాన్ని గడపాలని నిత్యం బోధించేవారని, దాని ప్రకారమే శిష్యులతోపాటు శిక్షణ తీసుకునే ప్రతి ఒక్కరూ పాటిస్తున్నామని, ఇది యోగాచార్య రాపర్తికి అందరూ ఇచ్చే గౌరవమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజనగిరి యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్ అధ్యక్షులు టి.సి.నర్సింహరావు, యోగా కేంద్రం అధ్యక్షుడు వెంకటేశ్వరావుతోపాటు మరి కొందరు ప్రముఖులను సత్కరించారు.

అసంపూర్తిగా డ్రైనేజీ నిర్మాణం



గొల్లల తాళ్లవలసలో డ్రైనేజీలో నిలిచిన మురుగు

తగరపువలస: భీమిలి మండలం గొల్లల తాళ్లవలసలో అసంపూర్తిగా నిర్మించిన డ్రైనేజీ కారణంగా మురుగునీరు పల్లపు ప్రాంతంలో మడుగులా నిలిచిపోయింది. దుర్గంధంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో డ్రైనేజీలు, రహదారి మరమ్మతులకు జాతీయ రహదారి నుంచి భీమిలి–దొరతోట రోడ్డు వరకు రూ.10 లక్షలు నిధులు కేటాయించారు. అప్పట్లో ఈ నిధులు పూర్తిగా ఖర్చు చేయకుండానే అరకొరగా మరమ్మతులు చేపట్టడంతో రెండు మాసాలలో కురిసిన వర్షాలకు రహదారి ఛిద్రమైపోయింది. ఇటీవల పంచాయతీ నిధులతో నిర్మించిన సీసీ డ్రైనేజీ కారణంగా కొంత వరకు స్థానికులకు ఉపశమనం కలిగింది. కానీ దీనిని జాతీయ రహదారి వరకు కొనసాగించి మురుగు నిలిచిపోకుండా చేయాలని గొల్లల తాళ్లవలస ప్రజలు కోరుతున్నారు.

భీమిలి హైస్కూల్‌లో హిందీ ప్రీ ఫైనల్ పరీక్షలు



భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో హిందీ లోయర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

తగరపువలస: ఈ నెల 11, 12వ తేదీలలో జరగనున్న దక్షిణ భారత హిందీ ప్రచార సభ–చెన్నై పరీక్షలకు సంబంధించి ఆదివారం ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించారు. భీమిలి నెహ్రూ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ పరీక్షలకు పరిచయ్, ప్రాథమిక, మాధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక విద్యార్థులు 64 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వాహకుడు, ఆదర్శ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్. కృష్ణారావు మాట్లాడుతూ గత వారం హయ్యర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు.

చాకిరేవు అభివృద్ధికి సహకారం



బల్లల పండగలో కేక్ కట్‌చేస్తున్న మహేష్

భీమునిపట్నం: భీమిలిలో రజకులకు సంబంధించిన చాకిరేవు అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ అన్నారు. ఆదివారం ఇక్కడ నిర్వహించిన రజకుల బల్లల పండగలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని కేక్ కట్‌చేశారు. చాకిరేవులో సమస్యలు ఉన్నట్టు తెలిసిందని, వాటికి సంబంధించి అవసరమైన సదుపాయాల కల్పన, ఇతర పనుల గురించి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి త్వరలో పనులు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

రజక సంక్షేమాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ ఈగల పాటి యువశ్రీ మాట్లాడుతూ రజకులు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మూడో వార్డు ఇన్‌చార్జి మైలిపల్లి షణ్ముఖరావు, అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నూకాలమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వాసుపల్లి కొండబాబు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక అవగాహనతోనే మానసిక ప్రశాంతత



నిత్యానంద, శ్రీచైతన్య మహాప్రభు విగ్రహాలకు అభిషేకం చేస్తున్న భక్తదాస

ఆనందపురం: ఆధ్యాత్మిక అవగాహన లేకపోవడం వల్లే చాలా మంది మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారని హరేకృష్ణ మూవ్‌మెంట్ విశాఖ జిల్లా అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస అన్నారు. గంభీరంలోని హరేకృష్ణ వైకుంఠం మందిరం నిర్మాణ ప్రదేశంలో ఆదివారం నిత్యానంద త్రయోదశి వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కుల, మత, జాతి, ప్రాంత, లింగ బేధాలతో గొడవలు పడుతూ ప్రశాంతత లేకుండా బతుకుతున్నారని చెప్పారు. ఈ తరుణంలో భక్తి వేదాంత స్వామి ప్రభుదాసు హరేకృష్ణ మహా మంత్రాన్ని విశ్వవ్యాప్తి చేశారని వివరించారు. హరేకృష్ణ జప యజ్ఞంతో సంకీర్తన నిర్వహించి ప్రశాంతత పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిత్యానంద శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువుల విగ్రహాలకు మహాభిషేకం, సప్త నదుల నుంచి సేకరించిన పవిత్ర జలాలతో నింపిన 108 కలశాలతో, పంచామృతం, పంచగంధ్య సువాసనలతో కూడిన పుష్పాలు, వివిధ రకాల పండ్ల రసాలతో ఘనంగా మహాభిషేకం నిర్వహించారు. స్వామి వారికి విశేషంగా 58 రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజా దాస, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన సీబీఎస్ఈ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఆరిలోవ: విద్యార్థులకు ఆరోగ్యకరమైన విద్యాబోధన కోసం విశాఖ వేలీ స్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ‘సీబీఎస్ఈ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం’ కార్యక్రమం ఆదివారం ముగిసింది. నగరంలో 30 సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన 80 మంది ఉపాధ్యాయులు ఈ వర్క్ షాపులో పాల్గొన్నారు. ఆదివారం రిసోర్స్ పర్సన్‌గా విశాఖవేలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ వ్యవహరించారు. ఇనీషియల్ మెంటల్ హెల్త్, గ్రోయింగ్ ఆఫ్ హెల్త్, న్యూటిషియన్ హెల్త్, శానిటేషన్, ప్రివెన్సన్ అండ్ మేనేజ్‌మెంట్ సస్టయినబుల్, రీ ప్రొడక్ట్ ఆఫ్ హెల్త్, తదితర వాటి గురించి అవగాహన కల్పించినట్టు ఆమె తెలిపారు.